


# సర్పశిల

## – భువనచంద్ర



*(గత సంచిక తరువాయి)*

*ఇప్పటివరకూ జరిగిన కథ*

*ఓ అడవిలోనున్న ఆలయం దగ్గర మొదలైన కథ, 'రాబీ వెబ్‌స్టర్ ' అనే అమెరికన్ ఇండియాలో దిగడంతో ఓ మలుపు తిరుగుతుంది. 'తక్షపురం 'లోని సర్పశిల ఒక మలుపుకి సంకేతమైతే 'నల్లమల 'లో జరిగిన విశ్వశాంతి యజ్ఞం మరో మలుపు. ఒక వైపున కొన్ని శక్తులు ప్రకృతి విధ్వంసానికి రచన చేస్తూంటే మరోవైపు ప్రకృతి రక్షకులు ప్రకృతిని కాపాడే ప్రయత్నాలు ముమ్మరం చేస్తుంటారు. అనేకానేక పాత్రలు తమ విధిని నిర్వర్తిస్తూవుంటాయి. అందరి లక్ష్యమూ ఒకటే - విశ్వశాంతి.*

"**గోర్కీ** నావాళ్ళు లోతుగానే పరిశీలించారు. ఇనుపముక్కు గద్దలు మంత్రంచేతో, మందుచేతో లొంగదీసుకొనబడ్డాయి. అవి చేసిన ఘోరం సామాన్యంకాదు. కొన్నివేల పశువులు, కుక్కలు పిల్లుల్లాంటి జీవులు, గొర్రెలు ఇతర జంతువుల శకలాలను పరీక్షలకు పంపటం జరిగింది. ఇప్పటివరకూ మనిషికి తెలియని ఓ విషం వల్ల అవి చంపబడ్డాయని తేలింది. అది ఏ విషమో ఇంకా తేలలేదు. అదృష్టం ఏమంటే అటువంటి సంఘటన మళ్ళీ రిపీట్ కాలేదు. ఆ విష ప్రభావమూ నాలుగు రోజుల తరవాత కనిపించలేదు" ఆగాడు సచేత్ దద్లాని.

డాంటే, స్తిట్సన్, రజోవ్‌స్కీ అందరూ గోర్కీతోబాటు శ్రద్ధగా వింటున్నారు.

"తక్షపురం విషయం నువ్వు చెప్పాక నా మనుషుల్ని పంపించాను. ఒక ముసలిది జనాల్ని భయపెట్టడం నిజం. రాత్రికి రాత్రి ఎక్కడికి పోయిందో ఎంత ఆచూకీ తీసినా తెలియలేదు. ఒకటి మాత్రం నిజం, ఆ సర్పాలు శిలవే. కానీ సజీవంగా ఉన్నట్లే వుంటాయిట. ఆ శిలామంటపం వెనక ఏదో ఓ నిగూఢ రహస్యం వుందని మా మనిషే చెప్పాడు. నాగప్రతిష్టలు అనేక కోర్కెలు సఫలం కావడం కోసం చేసారు. కొందరు సంతానం కోసం అయితే కొందరు నాగదోషం పోగొట్టుకోవడానికి. శ్రీకాళ హస్తిలో అయితే కాలసర్పదోషం తొలిగించుకోవడానికి రాహూ, కేతు పూజలు చేయిస్తారు.

గ్రహపీడ తొలగడానికి కూడా నాగప్రతిష్ట చేస్తారు. తక్షపురంలో ఉండే సర్పాలు ఎవరో ప్రతిష్టించిన దాఖలాలు లేవు. ఒకటి మాత్రం నిజం. ఆగ్రామమేగాక ఆ చుట్టుపక్కల గ్రామాలవాళ్ళు కూడా ఏదో భయంకర సంఘటన జరుగుబోతోందని భయపడుతున్నారు" అన్నాడు దద్లానీ.

"ఇంకా?" అడిగాడు గోర్కీ. సంభాషణ అంతా ఇంగ్లీషులో సాగుతోంది గనక స్టిట్సన్, డాంటే, రజోవ్స్కీలు ఏ మాత్రం ఇబ్బంది లేకుండా ఫాలో అవుతున్నారు.

"అడవిలో నివృత్తి యాగం నిర్విఘ్నంగా జరిగిందనీ, ఓ అద్భుతమైన, వెలుగులీనే శిల లభించిందనీ, అది ఆ శిథిలాలయంలోనే అమ్మవారి ఎదుట పెట్టి బడిందనీ, సంకల్పానంద అనే యోగి జీవితాంతం అక్కడేవుండి పోవడానికి నిశ్చయించుకున్నారనీ తెలిసింది. అరిదమన అలంబసులనేవారి మధ్య మహాభారత చర్చ జరిగిందట, అందులో అలంబసుడు మహాభారత కాలంనాటి తన జన్మ రహస్యాన్ని చెప్పాడుట. గోర్కీ యీ వివరాలు సేకరించడం తలకు మించిన పనైంది. సంకల్పానంద శిష్యుల్లో ఒకడు మావాడే. అంటే మా భాషకి చెందినవాడు. అంతేగాక తెలుగు, సంస్కృతము, హిందీ, ఇంగ్లీష్ భాషలు క్షుణ్ణంగా తెలిసినవాడు. అసలా అడవిలోకి దారి కనుక్కోవడమే చాలా కష్టమైంది. శృంగి, మట్టు అనేవాళ్ళు ఆ శిథిలాలయానికి వచ్చినట్టూ, వారి ఆధ్వర్యంలోనే మహాయాగమూ నివృత్తి యాగము జరిగినట్టూ మా 'బ్రహ్మచారి' చెప్పాడు. ఆ యాగ సమయంలో ఆ అడవిలో చాలా వింతలు జరిగాయట. ఆ యాగానికీ మనం చర్చిచేదానికీ సంబంధం ఏమిటో ఇప్పటిదాకా నాకు అర్థంకాలేదు. ఇంట్రెస్టింగ్ థింగ్ ఏమంటే మహాభారత ప్రస్థావన" అన్నాడు దద్లానీ. అందరూ సైలెంటైపోయారు. ఎవరి ఆలోచనలో వాళ్ళు, ఎవరి వూహా ప్రపంచంలో వాళ్ళు.

"బల్బు పక్కనే స్విచ్చి వుండదు. బల్బుకి దూరంగానూ వుండొచ్చు. దగ్గరగానూ వుండొచ్చు. బల్బు వెలగాలంటే స్విచ్చి వేసి తీరాలి. బహుశా యీ శిథిలాలయ విషయం కూడా ఓ స్విచ్చిలాంటిదేనేమో! కొన్ని విషయాలు అర్థంకాక మనసుని తొలుస్తూ వుంటాయి. నా మనసులోనూ యీ విషయం తొలుస్తూనేవుంది" అన్నాడు.

మొహమ్మద్ అతీం. అతను ఢిల్లీ కరస్పాండెంట్ చీఫ్.

"ఈ విషయాన్ని తేలిగ్గా తీసుకోవడానికి లేదు. మహాభారత ప్రస్తావన రాబీ వెబ్‌స్టర్ నించి కూడా వచ్చిందని విన్నాం. అది వివరంగా చర్చించాలంటే రాబీ, శాస్త్రిగారు మిగతా గ్రూప్‌ని కలిశాకే కుదురుతుంది ఫ్రెండ్స్. ఈ జన్మకి ముందు ఏదో ఓ రూపంలో మనం వుండి వుండాలిగదా! లేకపోతే అసలు పుట్టనే పుట్టంకదా! అలాగే మహాభారతమూ మానవ చరిత్రే. అదేమీ కల్పించినదో, కట్టు కథోకాదు. అప్పటి హస్తినాపురమేగా ఇప్పటి ఢిల్లీ. కురుక్షేత్రం ఉండనే వుంది. చారిత్రాత్మక స్థలాలు కోకొల్లలు. ఒకవేళ అప్పటి ఆత్మలు ఇప్పుడు పునర్జన్మని పొందితే? అప్పటి పగలు, ద్వేషాలు ఇప్పుడూ వుంటాయా? అప్పటి అస్త్రాలు, శస్త్రాలు ఇప్పటి జన్మలోనూ ఉపయోగపడతాయా? అసలు మంత్రపూరిత అస్త్రాలు

గుర్తుంటాయా? ఈ కోణంలోనూ కొంత ఆలోచించక తప్పదు" అన్నాడు. అభిజీత్ ఆచార్య ఇతను దద్లానీకి రైట్ హేండేకాదు, అత్యంత తెలివైన పాత్రికేయుడని గోర్కీకి తెలుసు.

"అదీ నిజమే! కొంచెంగా సమీక్షిస్తే,

పాయింట్ నంబర్ 1. ఇనుప గద్దల వ్యవహారం క్షుణ్ణంగా తేల్చాలి.

పాయింట్ 2 మహాయాగ, నివృత్తి యాగాలు అసలు ఎందుకు జరపబడ్డాయో, వాటి వెనకవున్న సూత్రధారులు ఎవరో తెలుసుకోవాలి. ఆ కార్యక్రమం వెనుక వున్న ఉద్దేశ్యాన్ని నిర్ధుష్టంగా పరిశీలించాలి.

పాయింట్ నంబర్ 3. రాబీ వెబ్‌స్టర్‌ని పర్సనల్‌గా కలిసి చర్చించాలి. అతనివల్ల చాలా వివరాలు స్పష్టంగా తెలుసుకునే అవకాశం వుంటుంది.

పాయింట్ నం 4. మరే సంస్థ అయినా బ్లాక్ మేజిక్‌లాంటివి చేసి ప్రజల్ని భయభ్రాంతుల్ని చేస్తోందా? చేస్తే వారికొచ్చే లాభం ఏమిటీ? ఇవి లోతుగా పరిశీలించాలి" అన్నాడు.

శమంతో భట్టాచార్య సీనియర్ మోస్ట్ బెంగాల్ సిటీ అబ్జర్వర్ రిప్రెజెంటేటివ్.

"యస్.. ఈ రోజు బ్రేక్ తీసుకుందాం. మన దగ్గరవున్న, విన్న సమాచారాన్నంతా క్షుణ్ణంగా పరిశీలిద్దాం. ఆ తరవాత మిస్టర్ రాబర్ట్ వెబ్‌స్టర్‌నీ అతనితో వున్న వారిని కలుద్దాం. బహుశా ఓదారి మనకి కనపడవచ్చు" అన్నాడు పంజాబ్ రిప్రజంటేటివ్ సబర్‌జీత్ సింగ్. అందరూ తలలు వూపారు.

"మెదడు చల్లబడాలంటే చల్లని బీర్ కంటే శ్రేష్టమయిన ద్రవం మరొకటిలేదు" అన్నాడు నరోత్తం ఝూ. ఆయన యు.పి కరెస్పాండెంట్.

పకపకా నవ్వి డాంటే అన్నాడు, "మెదడుని వేడెక్కించే ద్రవాల్ని కూడా తెప్పిస్తే ఇంకా బాగుంటుందేమో" అని. అందరూ నవ్వారు. ఓ క్షణం చల్లగాలిలా చల్లబడింది.

ఏకాదశి...

మహా కన్యాదేవి రోజంతా ఉపవాసంతో ఉన్నది. మాయమయి, 16గురు కన్యలూ కూడా ఉపవాస దీక్షలో వున్నారు. మహాకన్యాదేవి ప్రతి ఏకాదశి రోజునా, కొన్ని పర్వదినాల్లోనూ ఉపవాసంతోబాటు మౌనవ్రతాన్ని కూడా పాటిస్తుంది. మాయామయి ఉపవాసం ఉంటుందే తప్ప మౌనం పాటించదు. కారణం ఆశ్రమం నడపాలంటే జనాలతో మాట్లాడక తప్పదు. అదీగాక మహాకన్యాదేవిని అప్రమత్తంగా చూడమన్న నిశ్చలానంద ఆజ్ఞ. గురువు ఆజ్ఞని ఎవరు మీరగలరూ?

ఉదయాన్నే మహాకాళేశ్వర మందిరంలో మూడు అంతస్థులలోనూ వున్న మహాకాళలింగం,, ఓంకార లింగం, నాగచంద్రేశ్వర లింగాలను దర్శించుకుని అభిషేకాలు చేశారు.

పూజారులకందరికీ మహా కన్యాదేవి అంటే ఓ నడుస్తున్న దేవత అనే భావం కలిగింది. అంతటి నిర్మలమైన మోమునీ, మనస్సునీ వారెప్పుడూ చూడలేదు. ఇతర భక్తులూ అలాగే శ్రద్ధా భక్తులతో మెలుగుతున్నారు.

"హనుమంతూ.. నువ్వు ఆకలికి ఆగలేవు. ఏదైనా తిని రావొచ్చుగా. బోలెడన్ని ప్రసాదాలు వున్నాయి" అనునయంగా అన్నది మాయామయి. చిన్నగా నవ్వాడు హనుమంతు.

"అమ్మా.. ఇప్పుడిప్పుడే కాస్త బుద్ధి కుదురుగా వుంటోంది. మళ్ళీ కోతికి కొబ్బరి కాయ ఇస్తే" అన్నాడు.

"అదికాదురా..." అన్నది మాయామయి.

"అమ్మా ఇందరు ఉపవాసం చేయగలినప్పుడు నేను చేయలేనా? అయినా అమ్మ, యీ క్షిప్రా (క్రిష్ణా)నది అటూ ఇటూ భూమి లోపల ఏవేవో ఘోరమైన జీవులు ఉన్నాయని 'కన్నమ్మ' చెప్పిందిగదా! అవి అసలు బయటికొస్తాయా? ఒకవేళ వస్తే?" కుతూహలంగా అడిగాడు హనుమంతు.

"ఆ విషయం నాకు తెలీదురా, ఒకప్పుడు ఇప్పుడు మనకి కనిపించే మహా పర్వతాలన్నీ సముద్రంలో ఉండేవని, కాలక్రమేణా భూమి మెల్లగా జరుగుతూ జరుగుతూ పయనించడం వల్ల ఆ పర్వతాలు మన కళ్ళబడ్డాయనీ, సముద్రంలోపల మనం ఊహించను కూడా ఊహించలేని జలచరాలు అనేకానేకం ఉన్నాయనీ, అలాగే అంటార్కిటికా మంచుగడ్డల కింద వూహాతీతమైన జీవులు జీవనం చేస్తున్నాయనీ మా గురువుగారైన నిశ్చిలానంద చెప్పేవారు" ఆగింది మాయామయి.

చాలా శ్రద్ధగా వింటున్నాడు హనుమంతు.

"నాయనా హనుమా, ఈ సృష్టి అంతటికీ ఓ క్రమం వున్నది. క్రమశిక్షణ వున్నది. గ్రహాలు నిరంతరం తమ కక్ష్యను దాటకండా పరిభ్రమిస్తూనే వుంటాయి. భూమీ, సూర్యుడు, చంద్రుడు ఇలా గ్రహాలు ఏనాడూ తమ కక్ష్యని దాటి మరో కక్ష్యలోకి ప్రవేశించవు . ప్రవేశిస్తే జరిగేది ఘోరమైన పరిణామమే" ఆగింది మాయామయి.

"ఎటువంటి పరిణామం?" అన్నాడు హనుమంతు.

"ఒకటి గతి తప్పితే అన్నీ గతి తప్పుతాయి. ఒకటిని మరొకటి గుద్దుకుంటే ఏమవుతుందీ. సర్వనాశనం జరుగుతుంది. ఏ జీవీ మిగలదు" అన్నది మాయామయి.

"ఊ" అన్నాడు హనుమంతు ఆలోచిస్తూ.

"అందుకే చెబుతున్నా.. యీ సృష్టి ఓ క్రమంలో నడుస్తుందని. పగళ్ళూ రాత్రులూ ఠంచనుగా ఒకదాని తరవాత మరొకటి వస్తాయి. అలాగే ఋతువులు. ఏ ఋతువు కాలంలో ఆ ఋతువు ప్రభావం ప్రకృతి మీద వుంటుంది. నిరంతరం ఒకే వేసవికాలం ఉంటే తట్టుకోగలవా? అలాగే మూడొందల అరవై రోజులూ శీతాకాలమే వుంటే ఆ చలికి మనం తట్టుకోగలమా? అసలు పంటలు పండుతాయా? జీవులకి ఆహారం ఎలా లభిస్తుందీ? అలాగే ఏడాదంతా వర్షాకాలమే

అయితే మనిషికి నిలబడే చోటు వుంటుందా? ఆలోచించు. ఆలోచిస్తే తెలుస్తుంది. మనిషికి అతీతమైన శక్తి ఏదో వుందనీ, అదే సృష్టిని సక్రమంగా నడిపిస్తోందనీ" ఆగింది మాయామయి. ఆమె చెప్పే మాటల్ని హనుమంతేగాకుండా దర్శనార్థం వచ్చిన భక్తులు కూడా వింటున్నారు. వారిలో ఒకడు హిందీలో అన్నాడు, "మీరు మాట్లాడుతున్న భాష మాకు తెలీదు కానీ, ఆ మాటల అర్థం తెలిసీ తెలియనట్లుగా మా మనసుకి స్ఫురిస్తోంది" అని.

చిన్నగా నవ్వి మాయామయి తను చెపిన విషయాల్నే హిందీలో తర్జుమా చేసి చెప్పింది.

భక్తులు అవాక్కయ్యారు .మాయామయి మాటలకి ముగ్ధులయ్యారు.

"మీకు హిందీ వొచ్చా అమ్మా?" అన్నాడు హనుమంతు.

"జీవితం అన్ని భాషల్నీ నేర్పుతుంది హనుమా. అన్ని భాషలకంటే గొప్ప భాష మౌనం. ఆ తరవాత వచ్చేవి సంగీతం, ప్రేమ" అన్నది మాయామయి.

"నాయనా మళ్ళీ నీ ప్రశ్న దగ్గరికి వస్తే, యీ లోకమంతా ఓ పద్ధతి ప్రకారం నడుస్తోంది. ఒక మహాయుగం తరవాత మరో మహాయుగం సాగిపోతూనేవున్నది. కృత, త్రేతా, ద్వాపర, కలియుగాలు నాలుగూ కలిపితే ఓ మహాయుగం అవుతుంది. సృష్టి మొదలైన దగ్గర్నించీ ఎన్నివేల మహాయుగాలు గడిచినై. ఏ యుగధర్మం దానిదే. ఇది కలియుగం. ఇప్పుడు నడుస్తున్నది కలిధర్మం. ఇది అనేకానేక సంఘటనల సమాహారం. ఓ విధంగా చెబితే మనమూ కాలంతో బాటు ప్రతియుగంలోనూ జీవిస్తూ వస్తూవున్నవాళ్ళమే. ఒకే నాటకం వెయ్యేళ్ళు ప్రదర్శింపబడితే. నటీనటులు మారిపోయినా, నాటకం అదే అయినట్టు, మన రూప నామాలు మారినా మన ఆత్మలు అవే. అందుకే భూమిలోపలవున్న జీవులకీ ఓ లక్ష్యమూ గమ్యమూ వుండేవుంటుంది" సంభాషణ ఆపి లేచి నిలబడింది మాయామయి.

ఆమెతోపాటు భక్తులూ లేచారు. వారితోబాటు హనుమంతూ లేచాడు. పొద్దెలా గడిచిందో హనుమకి తెలీలేదు. మాయామయి మాటలు అతని మనసులో నాటుకుని ఓ మనో చిత్రాన్ని ఏర్పరిచాయి.

క్షిప్రా నది ఒడ్డుకి పోయి కూర్చున్నాడు.

"ఆదిలో వున్నాది అతడే

అంతాన వుండేది అతడే

ఆదియూ మధ్యమూ అంతాన వుండేది

ఆదిశివుడొక్కడే. జీవా.. ఆ....

సాంబశివుడొక్కడే దేవా...

రూపులూ పేరులూ

చైతన్య జడములూ

అన్నింటా వుండేది అతడే – అహా

అన్నీ భరించేది అతడే

ఉన్నట్టు ఉంటాడు

లేనట్టు ఉంటాడు.

ఉండియూ లేనట్టు

మాయజేస్తుంటాడు

కాలాన్ని సృష్టించు

కాళేశ్వరుండతడు

ఎక్కడని వెతికేది జీవా – అతడు

ఎవ్వరని అడిగేది జీవాజీవా"

చక్కని తెలుగులో పాడుతున్నాడొక యువకుడు. చక్కని స్వరం. మధురంగా, మంద్రంగా పాడ్తున్నాడు.

"మీరు తెలుగువారా? ఆశ్చర్యంగా అతన్ని చూసి అడిగాడు హనుమంతు.

"తెలుగులోనే కదా పాడుతున్నాను." నవ్వాడతను.

"మీరు?" అడిగాడు హనుమంతు.

"నేనా? నేను నేనే" నవ్వాడతను. ఆ నవ్వు నిష్కల్మషంగా వుంది.

"అంటే"

"అంతే! నేను నేనే"

"పేరు లేదా?"

"ఉంది, యీ శరీరానికి పెట్టిన పేరు మోహన్ గిరి" అన్నాడతడు.

"ఓహ్.. చాలా బాగుంది. నా పేరు  హనుమంతు" అన్నాడు హనుమ.

"తెలుసు. మహాయోగినులతో కలిసొచ్చావు కదూ! అంతా మంచే జరుగుతుంది. ఈ మహాకాళేశ్వరం వుంది చూశావూ ఇదో అద్భుత క్షేత్రం. ఇక్కడ కాలు పెట్టాలంటేనే జన్మజన్మల పుణ్యం కావాలి, కాలు పెట్టంగానే మహాలింగేశ్వరుడు నిన్ను తన వేపుకి తిప్పుకుంటాడు. నీచేత ఏం చేయించాలో అది నీకు తెలీకుండానే చేయిస్తాడు" నవ్వాడు మోహన్‌గిరి.

"అయ్యా.. నాకేమీ తెలీదు.. ఏ విద్యారాదు" ఖిన్నుడై అన్నాడు హనుమ.

"పిచ్చివాడా.. ఏమీ తెలియని తనమే స్వచ్ఛదనం. మనకి తెలిసింది అంతా పనికిరాని బురదే. ఆ 'తెలియడం' తెలియడం కాదు. దేనికీ కట్టుబడకపోవడమే సిసలైన విద్య. ఆ విద్యకు నువ్వు పాత్రుడవుగనుకనే పరమ చైతన్య స్వరూపుడైన శివుడు నిన్నిక్కడికి తెప్పించుకున్నాడు. నాయనా, యీ నదే నీకు గురువు

గురువుగానే భావించు. నేనో గులకరాయిని గురువుగా భావించా, నాకది ఎన్నో చెప్పింది, మౌనభాషలో" హనుమంతు తల నిమిరి అన్నాడు మోహన్‌గిరి.

హనుమంతు కళ్ళనిండా కన్నీరు. దేనికో అతనికే తెలీదు. మోహన్‌గిరి తన సంచిలోంచి ఓ బుల్లి శంఖాన్ని హనుమంతుకిచ్చి, "ఇది చిన్నదే. కానీ హనుమా ఇది సృష్టించే ధ్వని మాత్రం అద్భుతం. ఇది నీకు నా కానుక" అని మెల్లగా నడిచిపోయాడు.

చాలాసేపటివరకూ హనుమంతు అక్కడే నిశ్చేష్టుడై నిలబడి, ఆ తరవాత ఆ శంఖాన్ని కళ్ళకద్దుకుని కదిలాడు.

"ఎక్కడిదా శంఖం?" అడిగింది మాయమయి.

"మోహన్‌గిరి అని ఓ తెలుగాయన ఇచ్చారు. ఏవో చాలా చెప్పారు అమ్మా" అన్నాడు.

మాయామయి ఆ శంఖాన్ని పరిశీలించింది. దాని మీద స్వరూపం ఓంకారంలాగా ఆమెకి గోచరించింది.

"ఏదీ వూదు" అంది.

శంఖాన్ని పెదవులకి ఆంచి గట్టిగా గాలి పీల్చి పూరించాడు హనుమ. మందిరమంతా ఆ శంఖధ్వని మారుమ్రోగింది. మందిరంలో గంటలు గణగణా మ్రోగాయి, శంఖధ్వనికి అనుగుణంగా.

***(కొనసాగింపు వచ్చే నెలలో)***

Post your comments